

పాఠశాలలో వనదర్శిని

గాంధారి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గాంధారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను శుక్రవారం అటవీశాఖాధికారులు అటవీలోకి తీసుకెళ్లి వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హేమచందన ప్రతీ విద్యార్థి పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరగౌడ్, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, మన్సూర్, శరణ్య, శంకర్‌గౌడ్, సాయిలు, చిరంజీవి, మల్లేష్ పాల్గొన్నారు.



ఖాతా ఖాళీ

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఖాతాల్లో డబ్బులను కొల్లగొడుతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- భిక్కనూర్ మండలంలోని వ్యక్తి నుంచి రూ.7.20లక్షల కాజేత
- ఉద్యోగాల పేరిట పట్టణానికి చెందిన వ్యక్తికి బురిడి
- పోలీసులమంటూ డిజిటల్ అరెస్టుల పేరుతో టోకరా
- ఇలా ప్రతిరోజూ ఏదో ఒకచోట నమోదవుతున్న కేసులు
- రూ.లక్షల్లో నష్టపోతున్న అమాయక ప్రజలు
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఆగని మోసాలు
- ప్రజలే అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసుశాఖ

కామారెడ్డి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మీరు నిరుద్యోగా.. ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్నారా.. మీరు స్వయం ఉపాధి పొందేందుకు... లేదంటే ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగాలేక ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌ల కోసం చూస్తున్నారా.. అలా అయితే మీరు ఎవరిని ఏ విధంగా మోసం చేద్దామా అని కాచుకుని కూర్చునే సైబర్ మోసాగాళ్ల బారిన పడేందుకు సిద్ధమవుతున్నట్లే. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితులు రోజురోజుకు సాంకేతికత ఏ విధంగా పెరుగుతుందో సైబర్ నేరాలు సైతం అదేస్థాయిలో అధికమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల వినియోగం విరివిగా అందుబాటులోకి రావడంతో నిత్యం ఏదో ఒక యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం లేదంటే ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వెతకడం చేస్తుండడంతో అలాంటి వారిని బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు సిద్ధంగా ఉంటున్నారు. ప్రజల అమాయకత్వం, అత్యాశను అసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు రోజుకో రకంగా దోచుకుంటున్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఏటీఎం కార్డుల నెంబర్లు, ఇతర వివరాలు అడుగుతూ వచ్చిన వారు రూట్ మారుస్తున్నారు. మీకు పర్సనల్ లోన్ అప్రూవ్ అయ్యింది కొన్ని వివరాలు చెబితే డబ్బు మీ ఖాతాలో జమ అవుతాయని చెబుతున్నారు. లేదంటే లాటరీలో మీరు బహుమతులు గెల్చుకున్నారు. మీ అకౌంట్ నెంబర్, ఏటీఎం కార్డు నెంబర్లు చెబితే మీకు మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తామంటూ డబ్బులు లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా అనేక రకాలుగా మోసానికి కొత్త రూట్లు వెతుక్కుంటూ డబ్బులు దోచుకోవడమే పరమావధిగా సైబర్ నేరగాళ్లు ఆలోచన చేస్తున్నారు. కొంత మంది చదువుకున్న వారితో పాటు అమాయకులు సైతం వీరి ఉచ్చులో చిక్కి బలవుతున్నారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని బ్యాంకర్లు, ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్టులను నమ్మవద్దని, ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయవద్దన్నారు. పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యంగా చదువుకున్న యువతి, యువకులు నేరగాళ్ల వలలో పడి డబ్బులు మోసపోయామంటూ పోలీసుస్టేషన్‌ల మెట్లు ఎక్కడం విచిత్రంగా ఉంటుంది. చదువురాని వారంటే మోసపోయారంటే ఓ అర్థం ఉంటుందని ఉన్నత చదువులు చదివిన వారు ఆన్‌లైన్ వ్యవహారాలపై అవగాహన ఉండి మోసపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

మోసానికి కాదేది అడ్డంకి

సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు అమ్మేందుకు ఆన్‌లైన్‌లో కొన్ని వెబ్‌సైట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కూడా కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. ఎక్కువ ధర ఉండే సెల్‌ఫోన్లకు తక్కువ ధరకు ఇస్తామంటూమోసం చేస్తున్నారు. ఇది గ్రహించని అమాయకులు వారు పంపిన మెసేజ్‌లు, లింకులు ఓపెన్ చేస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు వారి ఫోన్‌ను హ్యాక్ చేస్తున్నారు. బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని, ఆధార్‌కార్డు సెంటర్ నుంచి కాల్ చేస్తున్నామని, మీ బిడ్డ అరెస్టు తీవ్ర నేరాలకు పాల్పడి అరెస్టు అయ్యాడని, నీవు ఓ అకౌంట్‌లోంచి డబ్బులు కాజేసినట్లు కేసు నమోదైంది నిన్ను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని భయపెట్టిస్తున్నారు. ఆందోళనకు గురైన వారు ఎంతో కొంత డబ్బులు సమర్పించి తీరా కొద్దిసేపటి తర్వాత మోసపోయామని పోలీసుస్టేషన్‌ల మెట్లు ఎక్కుతున్న వారు అనేకం ఉంటున్నారు. ఉద్యోగం కావాలంటే కొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి టాస్క్ టాస్క్‌కు కొంత డబ్బును అకౌంట్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని డబ్బులు కాజేసి మోసాలకు పాల్పడుతున్నారు.

మన అత్యాశ.. అమాయకత్వంతోనే ఖాతా ఖాళీ

సైబర్ నేరాళ్ల బారిన పడిన బాధితులు జిల్లాలో చాలా మంది ఉన్నారు. వీరంతా ఏదోరకంగా అత్యాశకు పోయి లేదంటే అమాయకత్వంతోనో నేరగాళ్ల ఉచ్చుకు చిక్కి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. డబ్బులు పోగొట్టుకున్న వారిలో చాలా మంది పోలీసులను ఆశ్రయించడం లేదు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని తెలిస్తే పరువు పోతుందని ఎవరికి చెప్పుకోవడం లేదు. మరికొందరు మాత్రం పోలీసుస్టేషన్‌లకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నా సమయం మించి పోవడంతో డబ్బులు తిరిగి రాక ఇబ్బందులకు గురవుతున్నారు. భిక్కనూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫేస్‌బుక్ చూస్తుండగా లాటరీ యాడ్ కనపడడంతో లింక్ నొక్కాడు. లాటరీలో 60లక్షల నగదు, 10 తులాల బంగారం గెలుపొందారని వాట్సాప్ కాల్ చేసిన సైబర్ నేరస్తులు ట్యాక్స్‌ల కోసం కొంత నగదును పంపాలంటూ నమ్మించారు. దీంతో సదరు వ్యక్తి రూ.7.20లక్షలు చెల్లించాడు. డబ్బులు చెల్లించిన తర్వాత ఫోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. కామారెడ్డి పట్టణానికి చెందిన మరో వ్యక్తికి గత రెండు నెలల కిందట హైదరాబాద్‌లో చదువుతున్న కొడుకు అరెస్టు అయ్యాడని ఫోన్ వచ్చింది. అతనికి కఠిన శిక్ష పడవద్దంటే తమకు రూ.1 లక్ష వరకు డబ్బులు చెల్లించాలని చెప్పడంతో వెంటనే తన వద్ద ఉన్న రూ.10వేలను అప్పటికప్పుడు పంపాడు. తీరా తన కొడుకును సంప్రదించగా హాస్టల్‌లో సేఫ్‌గానే ఉన్నాడని తెలియడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను సంప్రదించాడు. పట్టణానికి చెందిన మరో వ్యక్తి అమెజాన్ పేరిట ఉద్యోగం ఇస్తామని ఫేక్ కాల్ రావడంతో అది నమ్మి కొద్దిమేర డబ్బులు చెల్లించి ఐడీ తీసుకున్నాడు. అమెజాన్‌లో ప్యాకింగ్ విభాగంలో పని చేయాలని రూ.30వేల వరకు జీతం ఉంటుందని మాయమాటలు చెప్పి విడతల వారీగా డబ్బులు చెల్లించాడు. మరోసారి డబ్బులు పంపించాలని అడగడంతో ఏదేదో మోసంలా ఉందని పోలీసులను ఆశ్రయించాడు. గతంలో బీబీపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ. 7.50 లక్షలు మోసపోయాడు. దుబాయి నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు పార్సిల్ వచ్చాయంటూ ఆన్‌లైన్ మోసగాళ్లు సదరు వ్యక్తికి నమ్మబలికి లక్షల్లోనే నగదును కొట్టేశారు. భిక్కనూరు మండలానికి చెందిన ఓ యువకుడు జాబ్‌కోసం గూగుల్‌యాప్‌లో వెతుకగా గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి ఆమెజాన్‌లో జాబ్ ఆఫర్ ఉందని అందుకు మూడు టాస్కులు పూర్తి చేయాలని చెప్పి రూ.99,232లను కాజేశారు. గాంధారి మండలంలో ఓ తండాకు చెందిన వ్యక్తి ఫేస్‌బుక్‌లో ట్రాక్టర్, ట్రాలీ రూ.20 వేలకే ఇప్పిస్తామనే ప్రకటనకు ఆకర్షితుడై ఇచ్చిన లింక్‌లోని ఫోన్ నెంబర్‌కు కాల్‌చేసి రూ.28వేల వరకు పంపాడు. సదరు వ్యక్తి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి తన వద్ద దుబాయి నోట్లు ఉన్నాయని రూ.2.5లక్షలను దోచుకొని వెళ్లిన సంఘటన సైతం ఉంది. ఇలా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున సైబర్ నేరాలు చోటు చేసుకుంటుండడం నిత్యం సోషల్ మీడియాలో, వార్తపత్రికల్లో ఈ విషయాలు ప్రజలు చూస్తున్నా తమ వరకు వచ్చి

(మిగతా 8వ పేజీలో)

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ నాగరాణి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 7 బెంచీలతో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించబడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ నాగరాణి తెలిపారు. కక్షిదారులు రాజీ పడదగిన కేసులను రాజీకుదుర్చుకుని ఈ లోక్‌అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాల్లో లోక్‌అదాలత్ ఒకటి. లోక్ అదాలత్ ద్వారా జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కూడిన లోక్ అదాలత్ బెంచీలు వారికి సూచించబడిన కేసులను పరిష్కారిస్తాయని తెలిపారు. లోక్‌అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, వైవాహిక వివాదాలు, భూ వివాదాలు, విభజన, ఆస్తి వివాదాలు, కార్మిక వివాదాలు, బ్యాంకు రికవరీ వివాదాలు మొదలైన వాటిని, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను పరిష్కరించబడుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

నాణ్యతకు తిలోదకాలు

- లింగంపేటలో బురదలోనే కాలువ నిర్మాణ పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- రూ.49 లక్షలు వృథా చేస్తున్నారని రైతుల ఆగ్రహం

7



రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలి : కలెక్టర్

మద్నూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పత్తి పరిశ్రమకు ప్రసిద్ధిగాంచిన మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. శుక్రవారం ఆయన పత్తి కొనుగోలు చేసే జిన్నింగు మిల్లుకు వెళ్లి వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పత్తి వివరాలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్యతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడుతూ సకాలంలో పత్తిని తీసుకుంటున్నారా ఎప్పటి నుంచి పత్తి తీసుకువచ్చి వెయిట్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఒకేరోజులో పత్తి విక్రయిస్తున్నామని రైతులు తెలిపారు. అనంతరం సీసీఐ జిల్లా అధికారి రమ్యతో మాట్లాడుతూ ఇప్పటి వరకు సీసీఐ కొనుగోలు చేసిన వివరాలను రైతులకు వచ్చిన డబ్బుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని 8 సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం 43,231 క్వింటాళ్ల పత్తిని 14,014 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వారికి రెండు కోట్ల 74 లక్షల 49 వేల పేమెంట్ వచ్చినట్లు ఆమె కలెక్టర్‌కు వివరించారు. రైతులు ప్రైవేట్‌లో విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. మద్నూర్ మార్కెట్ పరిధిలో ప్రైవేట్ యజమానులు ఇప్పటి వరకు 75,196 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారని, ప్రైవేట్ వారు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారని, సీసీఐ ఎందుకు కొనుగోలు చేయడం లేదని అడిగారు. పత్తి పరిశ్రమ పరిశీలించి పత్తి ఎన్ని రకాలుగా ఉపయోగపడుతుందో పరిశ్రమ గురించి స్వయంగా చూశారు. అనంతరం జిన్నింగ్ మిల్లు యజమాని రాజేష్ కాకానితో మాట్లాడుతూ పత్తి పరిశ్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీఐ ఇన్‌చార్జి అధికారి ఓబుల్ రెడ్డితో మాట్లాడుతూ పత్తి బేళ్లుగా తయారైన తర్వాత ఏ విధంగా విక్రయిస్తారని ఎక్కడికి పంపిస్తారని తెలుసుకున్నారు. పత్తి బేళ్లను బీడింగ్ ద్వారా విక్రయిస్తామని, గుజరాత్ వ్యాపారులు టెండర్ ద్వారా కోట్ చేసి పత్తి బేళ్లు తీసుకుంటారని ఎవరు ఎక్కువ మొత్తంలో టెండర్ వేస్తారో వారికి విక్రయిస్తామని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించాలని మార్కెట్ అధికారులకు సూచించారు. ఆయనతో పాటు డీఎల్‌పీవో నాగరాజు, తహసీల్దార్ ముజీబ్, రేణుక, ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకట నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య, రమేష్, కార్యదర్శి రామ్‌నాథ్, సందీప్ తదితరులు ఉన్నారు.



మద్నూర్‌లో సీసీఐ వెయిట్ బ్రిడ్జి వద్ద రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం బిచ్కుంద మండల ఫత్లాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు ఇళ్లు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్ల నిర్మాణానికి అనువైన భూమి ఉందో లేదో తెలుసుకోవాలని అన్నారు. సర్వేకు ఒకరోజు ముందు గ్రామంలో టామ్‌టామ్ చేయాలని తెలిపారు. సర్వే సమయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. అనంతరం బిచ్కుంద ఐటీఐని పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో గోపాల్ కృష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ నగేష్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే..

గర్వపడే ప్రాజెక్టు నిజాంసాగర్!



సాగు గేట్ల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి ఉత్తమ్



గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న మంత్రి

- నైజాం నవాబులు తెలంగాణలో మొట్టమొదట నిజాంసాగర్‌ను నిర్మించారు
- గత ప్రభుత్వం మనందరినీ తాకట్టు పెట్టింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు సన్న ధాన్యం కొనుగోలు చేసి బోనస్ చెల్లిస్తాం
- సంక్రాంతి కానుకగా రైతులకు భరోసా అందిస్తాం
- ఏడాది ఇరిగేషన్ రంగానికి రూ.22 వేల 500 కోట్ల కేటాయింపు
- రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నిజాంసాగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే నైజాం ప్రభుత్వంలో తెలంగాణలో నిర్మితమైన నిజాంసాగర్ ప్రాజెక్టు గర్వపడే విధంగా ఉందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉభయ జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు ప్రత్యేక పూజలు జరిపి ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుపైన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను తాకట్టుపెట్టి వేల కోట్ల రూపాయలు ఇరిగేషన్ రంగానికి వెచ్చించినా ఫలితం లేకుండా పోయిందని ఆ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు మూన్నాళ్లకే కూలిపోయాయని ఆయన విమర్శించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు ప్రభుత్వమే కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఏడాది ఇరిగేషన్ రంగానికి రూ.22వేల 500 కోట్లు ఖర్చు చేస్తుందని, మరో రూ.12వేల కోట్లతో నీటి వనరులకు మరమ్మతులు చేస్తుందని ఆయన అన్నారు. కోట్లు వెచ్చించిన మేడిగడ్డ నుంచి వర్షానికి చుక్క నీరు తీసుకోలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో సన్న ధాన్యాన్ని ఒక వంద 57 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసి 66.7 బోనస్ 40 లక్షల మందికి అందించడం జరిగిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు మహిళలకు వడ్డీ లేని రుణాన్ని అందజేస్తామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయడంతో మాకేంతో సంతృప్తిగా ఉందని ఆయన అన్నారు. త్వరలో రేషన్‌షాపుల్లో సన్న బియ్యం అందించడమే కాకుండా ఇందిరమ్మ నిర్మాణాలకు కూడా శ్రీకారం చుడతామని ఆయన అన్నారు. నిజాంసాగర్ నీటిని వృథా చేయకుండా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు అండగా ఉంటామని ఆయన అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఏమి చేసిందని విషయం ప్రజలకు తెలుసునని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత వరకు మహిళలకు ఫ్రీ బస్సుతో పాటు ఆధునిక చికిత్స కోసం రూ. పది లక్షలతో ఒకరికి చికిత్స చేయించేందుకు ప్రణాళిక రూపొందించామని ఆయన అన్నారు. మంజీరా నది పైన నిర్మాణం చేపడుతున్న నాగమణి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకం ద్వారా 40 గ్రామాలకు సాగునీరు అందించి సాగు భూముల్లో సిరులు పండించి రైతు ముఖాల్లో ఆనందాన్ని కనపడేటట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో ఆగ్రో ఇండస్ట్రియల్ చైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ అనిల్, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, నీటిపారుదల శాఖ కామారెడ్డి సీఈ శ్రీనివాసరావు, నిజాంసాగర్ ఈఈ సొలోమన్, బాన్సువాడ జుక్కల్

(మిగతా 8వ పేజీలో)

శబరిమలకు తగ్గింపుతో ప్రత్యేక బస్సులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తులకు కామారెడ్డి, బాన్సువాడ డిపోల నుంచి శబరిమలకు వెళ్లేందుకు భారీ తగ్గింపుతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని రీజినల్ మేనేజర్ జోస్నా తెలిపారు. శబరిమల కార్యకలాపాల కోసం బస్సులో సీట్లు ఇవ్వకుండా ఇద్దరు వంట మనుషులు ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించబడిందని, 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న ఇద్దరు మణికంఠలకు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం, ప్రయాణికుల సామాను తీసుకువెళ్లడానికి ఒక అటెండెంట్ సీటు ఇవ్వకుండా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. బుకింగ్ కోసం కామారెడ్డి 7382843747, బాన్సువాడ 9491105706 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని బోధన్ రూరల్‌లోని చిన్న మావంది, పెగడాపల్లి, ఊట్‌పల్లి, రెంజల్ మండలంలోని రెంజల్, నీలా, ఎడపల్లి మండలంలోని ఎడపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఏర్గట్లలో బోధన్ ఎమ్మెల్యే పర్యటన

ఏర్గట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శనివారం ఏర్గట్ల పర్యటనకు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొననున్నారన్నారు.

గోపాల్ పేట్ హైస్కూలుకు
రూ. లక్ష విలువ గల సామగ్రి అందజేత



మాట్లాడుతున్న గోపాల్‌పేట్ హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్‌రాంరెడ్డి

నాగిరెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎల్. శ్రీనివాస్‌కు అమెరికాలో స్థిరపడిన ముత్యపు సందీప్ కుమార్ బంధువు. తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థుల కోసం సహాయం అందజేయాలని హెచ్‌ఎం అభ్యర్థించారు. దీంతో అమెరికాలోని మిన్నెసోట ఏరియా తెలంగాణ అసోసియేషన్ (మాటా) డైరెక్టర్ ముత్యపు సందీప్ కుమార్ తమ సంస్థ ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువ గల పలు వస్తువులను పాఠశాలకు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి వాటర్ ప్యూరిఫైర్, సైన్స్, మ్యాథ్స్, గేమ్స్ మెటీరియల్‌తో పాటు గ్రంథాలయ పుస్తకాలు, బీరువాలు ఇతర సామగ్రి అందజేసినట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. దీంతో శుక్రవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి తాగునీటి వాటర్ ప్యూరీ ఫైర్‌ను స్థానిక ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకట్ రామిరెడ్డి మాట్లాడుతూ విదేశాల్లో ఉండి మన ప్రాంతం విద్యార్థుల కోసం సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాల్తుమ్మెద హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్ రాజు, సీఆర్‌పీ రాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి

మోస్రా,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బోధన్ ఆర్డీవో శ్రీనివాస్ వాహనదారులకు, ట్రాక్టర్ యాజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, రోడ్లపై ట్రాక్టర్ కేజీవీల్స్‌కు పట్టీలు లేకుండా నడిపితే 30వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామాల్లో అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంత, ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కొడిచర్లలో 50 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

కోటగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో శుక్రవారం 50 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. గ్రామంలోని పోచమ్మ గుడి, ఈరన్న కుంట, పొతంగల్ రహదారిలో సుమారు 50ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు ఉన్నట్లు తమకు సమాచారం అందడంతో సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు, ఇళ్లు నిర్మించుకునే వారికి అనుమతి ఇస్తామన్నారు. ట్రాక్టర్‌కు 600రూపాయల చొప్పున డీడీ చెల్లించి ఇసుకను తీసుకోవాలని సూచించారు. ఇసుకను అనుమతులు లేకుండా డంప్‌లు చేసిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరా

బీర్కూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై శుక్రవారం కేంద్ర బృందం సభ్యుడు గోపాల్ ఆరా తీశారు. బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంతో పాటు బీర్కూర్, అన్నారం, దామరంచ, రైతునగర్,బరంగేడ్గి గ్రామ పంచాయతీలకు వెళ్లి నిధుల వినియోగం విషయమై జీపీ కార్యదర్శులతో మాట్లాడారు. విధుల వినియో గానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

బషీరాబాద్‌లో మల్లన్నస్వామి పల్లకీ ఊరేగింపు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూల గుట్టపై కొలువుదీరిన యాదవులు ఆరాధ్య దైవం మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవం, జాతరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం యాదవ సంఘాల అధ్వర్యంలో స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. యాదవసంఘాల మహిళలు మంగళహారతులతో ముందు నడవగా గ్రామం ప్రధాన వీధుల గుండి మేళతాళాలు మంగవయిద్యాయ్యల మధ్య స్వామివారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహిస్తు దూలగుట్ట పైగల ఆలయానికి చేర్చారు. కాగా సోమవారం స్వామివారి కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గణేష్, కార్యదర్శి దేవన్న ముకేష్, బైకాని మహేష్, చిన్నయ్య, రవ్వన్న, రామకృష్ణ, ఆశన్న, భూమన్న, రాజు, అబ్బాస్, సాగర్, దీక్షాస్వాములు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

బోధన్‌రూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట స్వామి మాదిగ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పర్గ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 27న వేల డప్పులు, లక్షల గొంతుకలు హైదరాబాద్ తరలిరావాలన్నారు. రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు వాటా దక్కేలా రిజర్వేషన్ల వర్గీకరణ చేయాన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలయ్యే వరకు ఎలాంటి నియామకాలు కాని, నూతనంగా నోటిఫికేషన్లు కాని ఇవ్వరాదని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ బోధన్ మండల ఇన్‌చార్జి గోనేవార్ మారుతి, తాడెం అబ్బయ్య, జాదవ్ ఫకీరా నాయక్, విజయ్ కుమార్, రంజిత్, గంగాధర్, విజయ్, అభినాష్, వీరేష్, సాయిలు, లక్ష్మి, మొగులాబాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంసీఏలో మొదటి ర్యాంక్
సాధించిన సిబ్బందికి సన్మానం

తాడ్వాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీసీఎంసీఏ పరీక్షల్లో తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించిన నితీష్‌రెడ్డిని శుక్రవారం సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి సిబ్బందితో సన్మానించారు. తాడ్వాయి మండల సొసైటీ సిబ్బంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాడ్వాయి సిబ్బంది అయినటువంటి ఏనుగు నితీష్ రెడ్డి కోఆపరేటివ్ సొసైటీకి ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహింపజేసే సంస్థ అయిన తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ గన్‌ఫౌండ్రి హైదరాబాద్ వారి ఎనిమిదో బ్యాచ్ డిప్లొమా ఇన్ కోపరేటివ్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్ అప్లికేషన్స్ 2024 సంవత్సరంలో కోర్సుకు 38 మందితో కలిపిన సొసైటీ ఉద్యోగులకి నిర్వహింప చేసినటువంటి డీసీఎంసీఏ కోర్సుకు అప్లై చేసి సీటు పొంది శిక్షణా క్లాసులకు హాజరై తుది పరీక్షలు అక్టోబర్ నెల 2024లో రాసి 12/12/2024 రోజున విడుదల అయిన ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సంపాదించి నటువంటి మా సంఘ సిబ్బంది ఏనుగు నితీష్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ సన్మానం చేశారు. కావున వీరికి సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు, సొసైటీ కార్యదర్శి, సిబ్బంది, కోపరేటివ్ యూనియన్ ప్రిన్సిపాల్ డాక్టర్ భూక్య వెంకన్న తెలిపారు.

ఎత్తిపోతల మరమ్మతులకు నిధులివ్వండి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ ఎత్తిపోతల పథకం మరమ్మతులు, నూతన పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యే కలిసి నికాల్‌పూర్, మారంపల్లి, తల్వేద, వన్నెల్(కె), ఎత్తిపోతలకు మోటర్‌ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా కాళేశ్వరం ప్యాకేజీలో భాగంగా పైప్‌లైన్ వేయాలని, గుత్ప ఎత్తిపోతల పథకం అదనపు లిఫ్ట్ మునిపల్లి వరకు పొడగించాలని, ఈ లిఫ్ట్ ద్వారా జక్రాన్‌పల్లి మండలంలోని ఐదు గ్రామాలు, మాక్లూర్ మండలంలోని ఎనిమిది గ్రామాలకు లబ్ధిచేకూరుతుందన్నారు. అధిక భాగం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అతి త్వరలో నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోస్రా,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మైనారిటీ గురుకుల పాఠశాలలో, జిల్లా పరిషత్ పాఠశాలలో వంట సామగ్రి, సరుకులు, కూరగాయలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల సిలబస్‌పై ముచ్చటించారు. అనంతరం చందూర్ మండలంలోని ఘన్‌పూర్, మోస్రా మండల కేంద్రంలో, గోవూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఇళ్ల సర్వే పకడ్బందిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందూర్ తహసీల్దార్ శాంత, ఎంపీడీవో నీలావతి, మోస్రా తహసీల్దార్ మారుతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఆయా గ్రామాల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్‌పీల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా ఆర్‌పీలు హైదరాబాద్ ఎండీ ఆఫీస్‌కు వెళ్తుండగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మామిడిపల్లిచౌరస్తా వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రతీ ప్రభుత్వ సర్వేలు చేస్తున్నామని, సరియైన గుర్తింపు లేదని, నెలకు రూ.20వేల వేతనం ఇచ్చి తమను ఆదుకోవాలని, గత తొమ్మిది నెలలుగా జీతాలు రాక కుటుంబ పరిసితులు అగమ్యగోచరంగా ఉన్నాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్‌పీ యూనియన్ అధ్యక్షురాలు అరుణ, మహిపాల్, అన్నపూర్ణ, కల్పన, సత్య, లహరి, జ్యోతి, కవిత, సహస్ర పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ వాహనంలో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు తెలిసిన సమాచారం మేరకు అధికారులు దాడులు నిర్వహించి ఐచర్ వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఆర్మూర్ -15) విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

గణితం టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ఎంపిక

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో పాఠశాల విద్యార్థిని రునాఖాతూన్, సాహితిలు మొదటి, రెండో బహుమతులు సాధించగా రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడంతో వారితో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కవిత, గంగామణి, కురిజామోహిన్, రిజ్వన, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి రుత్విక్ రాష్ట్ర సీనియర్ బెస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ బొజ్జ మల్లేష్‌గౌడ్ తెలిపారు. ఈనెల 11న పట్టణలోని బాలుర స్కూల్‌లో సీనియర్ బెస్‌బాల్ ఎంపిక పోటీల్లో రుత్విక్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర సీనియర్ బెస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పుప్పాల లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘనసన్మానం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో క్రీడాకారులకు ఘనంగా సన్మానం చేశారు. ఈనెల 11, 12తేదీలలో తెలంగాణ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లలో విద్యార్థిని ఎం.అంజలి అథ్లెటిక్స్‌లో 800మీటర్ల లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో గెలుపొందారు. నిహరిక వాలీబాల్ టీం క్యాప్టెన్‌గా వ్యవహరించి రన్నరప్‌గా నిలిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక విద్యార్థులకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకన్నస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోనాసమందర్ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరస్వామి జాతరా ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామివారి ఊరేగింపు,స్వస్తిపుణ్యావాచనం, విష్వక్సేనరాధన, అంకురార్పనము, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు జే.సుధాకర్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాజకీయ పార్టీ నాయకులు కమిటీ సభ్యులు ఎల్లయ్య, రాజగంగారాం, దుపల విజయ్ కుమార్, సామ రాజేశ్వర్ రెడ్డి, ఎంసి గౌడ్ పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం సెర్ప్ సీఈవో జన్మదిన వేడుక సందర్భంగా పేదలకు నిత్యవసర సరుకులు అందించారు. ఐకేపి సిబ్బంది. రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వాహన అధికారి దివ్యా దేవరాజన్(ఐఎఎస్) పుట్టిన రోజు సందర్భంగా ఐకేపీ ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కుంట గంగారెడ్డి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందించారు. కార్యక్రమంలో సీసీలు రవి కుమార్, అలేఖ్య, పిఓలు, ఐకేపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందించాలి

జక్రాన్‌పల్లి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) గుత్ప లిఫ్ట్ ద్వారా మండలంలోని ఐదు గ్రామాల రైతాంగానికి పంటల సాగుకు లిఫ్ట్ పూర్తి చేసి ఈ లిఫ్ట్ ద్వారా పంటలకు సాగునీరు అందించాలని కోరుతూ శుక్రవారం ఇరిగేషన్, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జక్రాన్‌పల్లి మాజీఎంపీపీ కె.అనంత్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. పోచంపాడ్‌లో ప్రాజెక్టును సందర్శించడానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన కలిశారు. గ్రామాల రైతులకు పంట సాగు కోసం సాగునీరు అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని జక్రాన్‌పల్లి మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలని వినతి

ముప్కాల్ డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) బాల్కొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌లను ఏలాంటి రాజకీయ బేషారతులకు పోకుండా పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని మాజీమంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు సందర్శించి సమీక్ష సమావేశానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికి అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20, 21, 21ఏ ప్యాకేజీ ద్వారా 5800కోట్లతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ప్రతిపాదించారని, బాల్కొండ నియోజకవర్గంలో 80వేల ఎకరాలు, రూరల్ కింద 29వేల ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో ఆరు వేల ఎకరాలు ఉన్నాయన్నారు.

బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

వేల్పూర్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్టను నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియంలో వేల్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన జె.రితిష్ ప్రథమ, పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.విశ్వతేజ ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే తెలుగు మీడియంలో వేల్పూర్ పాఠశాలకు చెందిన ఆర్.రమేష్ ప్రథమ, లక్కోర ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్.అర్వింద్ ద్వితీయస్థానంలో గెలుపొందారు.

'ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలి'


ముప్కాల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించే వసతిగృహాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రోగ్రాంలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మాంతు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశ నిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే వంద శాతం డైట్ రూ200, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవం అట్టహసంగా ప్రారంభించి విజయవంతం చేశారని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయికి ఎదగాలి

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం పొందుతు ఉత్తమక్రీడాకారులుగా రాణించాలని జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్యఅన్నారు. మూడు రోజుల పాటు కమ్మర్‌పల్లి మినిస్టేడియంలో నిర్వహించిన సీఎంకప్ క్రీడల విజేతజట్లకు శుక్రవారం బహుమతులు అందజేశారు.

జనావాసాలకు దూరంగా బట్టీలను ఏర్పాటు చేసుకోండి

రెంజల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ఉన్న పొగాకు బట్టిలను తొలగించి గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కందకుర్తి గ్రామంలో పొగాకు పండించే రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పొగాకు పండించిన రైతులు బట్టిలను గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పొగాకు కాల్చడం వల్ల ఏర్పడే అనర్థాల గురించి వివరించారు. అలాగే జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల ఆదేశానుసారం గ్రామ ప్రజలు, రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రైతులు తంబాకు ఎండ పెట్టే ప్రక్రియపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల సూచనలు తెలియపర్చడం జరిగిందన్నారు. గ్రామానికి దూరంగా పొగాకు బట్టిలను ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు ఇబ్బంది ఉండదన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్

మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఈనెల 16, 17తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నా విష యమై మండల విద్యాధికారి రాజగంగారాం వినతిపత్రం అందజేశారు. ధర్నా నిర్వహించే తేదీలలో మధ్యాహ్న భోజనం అందించబోమని తెలిపారు. ఈ విషయం ప్రధానోపాధ్యాయులు గమనించాలని ఆయన కోరారు. అదే విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, ప్రభుత్వమే సరుకును అందజేసి పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయ కులు గుండెటి శంకర్, సుజాత, పద్మ, దేవయాని, స్వరూప, నర్సుబాయి, భూలక్ష్మీ, సత్తెమ్మ, జయ, భవిత తదితరలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ అందించాలి

మోస్రా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎటువంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో చేయాలని ఎకరానికి 7,500 రూపాయలు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చందూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ శాంతకు బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రైతులకు పూరిస్థాయిలో రుణమాఫీ చేయలేదు. పైగా ఎన్నికల ప్రచారసభలో చెప్పని షరతులు ఇప్పుడు విధిస్తూ రైతుల రుణాలు మాఫీ చేయట్లేదన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి 7,500 రూపాయలు ఇస్తామని చెప్పి రైతుల వరినాట్లు ప్రారంభమైనప్పటికీ ఇంకా వేయడం లేదన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి విఠల్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అర్కల సాయరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరెడ్ల నర్సింలు, సీనియర్ నాయకులు శంర్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సాహిత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యోగేశ్వర్ గౌడ్, కృష్ణ మూర్తి, కృష్ణ గౌడ్, బన్నీ రెడ్డి, వడ్ల శంకర్, బాలురెడ్డి, గాండ్ల శ్రీనివాస్, రగోభ సత్యం, సాయిబాబా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రామారెడ్డి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం రంగంపేట్ గ్రామంలో నారెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి రెండు వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ కొద్ది రోజుల క్రితం చనిపోయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రెండు వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ క్రమంలో రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి స్పం దించి వెంటనే రెండు వేల నగదు సహాయం నారెడ్డి మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరణించిన షేక్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనీఫ్ మహ్మద్, మండల సీనియర్ నాయకులు సురేందర్‌సింగ్, రంగంపేట మాజీ ఉప సర్పంచ్ ఖలీల్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన
బీఆర్‌ఎస్, జాగృతి మండల నాయకులు

బోధన్‌రూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితను శుక్రవారం బోధన్ మండల బీఆర్‌ఎస్, జాగృతి నాయకులు మర్యాద పూర్వకంగా ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ బోధన్ మండల అధ్యక్షులు సంజీవ్ కుమార్, బోధన్ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు భవానీపేట్ శ్రీనివాస్‌లు బోధన్‌లో రాజకీయ పరిణామాలను ఆమెతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భవానీపేట్ శ్రీనివాస్, జాగృతి నాయకులు అల్లడి దేవ, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షాకీర్ పటేల్, కొప్పర్గ రాములు, పెంటాకలాన్ రవి, ఖండ్‌గాం రాములు, స్రుజన్ కుమార్ పాల్గొన్నారు.

లింగమయ్య గుట్ట ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

నవీపేట,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయం 5వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం గణపతి పూజ, పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమం, శివ లింగాభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఆదివారం ముగియనున్నాయి.

ఒకరి రిమాండ్

నవీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన రమేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 9న రాత్రి యాదగిరి అతని బావ రమేష్ కుటుంబాల మధ్యన గొడవ జరగగా ఇందులో ఇద్దరికి గాయాలు కాగా ఏడుగురిపై కేసు నమోదు అయిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి రమేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

యోగా కేంద్రాన్ని ప్రారంభించిన మెడికల్ ఆఫీసర్

మోస్రా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మించిన యోగా కేంద్రాన్ని శుక్రవారం మండల మాజీ జడ్పీటీసీ గుత్పభాస్కర్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా చేయడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. మండల ప్రజలు యోగా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయుష్ ఆయుర్వేద వైద్యులు, పతంజలి జిల్లా నాయకులు, యోగా టీచర్ ప్రవీణ్‌కుమార్, గ్రామ పెద్దలు పోతురెడ్డి, సూరె సాయిలు, సుదర్శన్ గౌడ్, భూపాల్ రెడ్డి, యోగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి బయోసైన్స్
ప్రతిభ పోటీ పరీక్ష పత్రాల విడుదల

రెంజల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మండల స్థాయి ప్రతిభ పోటీ పరీక్ష పత్రాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు విడుదల చేశారు. ప్రతి సంవత్సరం టీబీఎస్‌ఎఫ్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు శేఖర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, జీవశాస్త్రం ఉపాధ్యాయులు సాయన్న, భూమయప్ప, రవీందర్, మాణిక్యం, గంగాధర్, చంద్రకళ, షబానా, నజీం ఉన్నీసా పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో
రాష్ట్ర ప్రభుత్వం విఫలం : వెంకటేశ్వర్లు

బోధన్‌రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన ఆరు గ్యారంటీలను అమలు పర్చలేనందుకు ఆరు గ్యారంటీలు, 66మోసాలను చూపించి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో నడిపే వారికి సంవత్సరానికి 12వేలు ఇస్తామని, ఫ్రీ బస్సులు పెట్టి ఆటో వాళ్ల కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు 2500రూపాయల ఆర్థిక సహయం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు అని చెప్పి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సింహ రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్, మాజీ జడ్పీటీసీ మేక విజయ సంతోష్, వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, సరిన్, మనోహర్, గోపికృష్ణ, ఇంద్రకరణ్, ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వర్ని,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కల్పనా కుమారి మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహిస్తూ రాబోయే వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, మంగమ్మ, వినోద్ కుమార్, షమీముద్దీన్, విష్ణువర్ధన్, సతీష్ కుమార్, తిరుమలాదేవి, అశ్విని, అజ్మతున్నీసా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్‌రూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, హెచ్ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌సీపీసీ కౌన్సిలర్ రాజన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు పోయి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఏస్‌ఆర్‌సీ కౌన్సిలర్ రాజశేఖర్, స్నేహ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోకస్

నాణ్యతకు తిలోదకాలు!





- లింగంపేటలో బురదలోనే కాలువ నిర్మాణ పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- రూ.49 లక్షలు వృథా చేస్తున్నారని రైతుల ఆగ్రహం

లింగంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని మత్తడి కాలువ నిర్మాణ పనులు నాణ్యత లేకుండా చేపడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మత్తడి కాలువ చెడిపోవడంతో నీరు రాలేదు. ఫలితంగా దానిపై ఆధారపడిఉన్న చీరపేండ్ల కుంటలోకి నీరు అందక పంటలు సాగు అసాధ్యమైంది. ఇన్నాళ్లు తమ సమస్యలు ఎవరూ పట్టించుకోలేదని రైతులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సహకారంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించి ఆయన కాలువ నిర్మాణం కోసం రూ.49 లక్షలు మంజూరు చేశారు. నీటి పారుదల శాఖ అధికారులు కాలువ నిర్మాణం కోసం టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మాణ పనులతోపాటు కాలువ నిర్మాణ పనులను చేపడుతున్నారు. కాలువ గ్రామ సమీపం గుండా వెళ్లడంతో కాలువలోకి గ్రామానికి చెందిన మురికినీరు, బురద నీరు కాలువలోకి చేరుతోంది. సదరు కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణంలోనూ, సైడ్‌వాల్స్ నిర్మాణంలోనూ బురదను తొలగించ కుండా బురదలోనే కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నాడు. సైడ్ వాల్స్‌కు ఎలాంటి బెడ్ వేయకుండా, కనీసం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా బురదలోనే పనులు చేపట్టడం పట్ల గ్రామ రైతులు కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.49లక్షలు బురదలో వేస్తున్నారని, ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని మాజీ ఎంపీపీ ముదాం సాయిలుతో పాటు రైతుల ఏఈఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ బెడ్ వేసి సైడ్‌వాల్స్ నిర్మించాల్సి ఉండగా ఎలాంటి బెడ్‌వేయకుండానే సైడ్‌వాల్స్ నిర్మిస్తున్నారని తెలియజేశారు. ఇరిగేషన్ అధికారులు తమకు ఎందుకు అన్నట్లుగా పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పనులు నాణ్యతగా చేపెట్టేవిధంగా చూడాలని వారు కోరుతున్నారు. పాతిక సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోని మత్తడి కాలువ ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరైతే అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైనాణ్యత లేని పనులు చేస్తున్న చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను నాణ్యతగా చేపట్టకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

పనులు నాణ్యతగా చేయిస్తాం

● మనోహర్ రెడ్డి డీఈఈ

మండలకేంద్రంలో చేపడుతున్న మత్తడి కాలువ, కల్వర్టుల నిర్మాణ పనులను నాణ్యతతోనే చేపట్టేలా చూస్తాం. బురద మట్టిలో చేస్తున్న పనులను పర్యవేక్షించి అలా జరగకుండా చర్యలు చేపడతాం.



పెద్దతడుగూర్‌లో అయ్యప్ప మెట్ల పూజ నిర్వహిస్తున్న స్వాములు

ఓంఓం అయ్యప్ప..

- శరణు ఘోషతో మార్మోగిన పెద్దతడుగూర్
- కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ
- తరలివచ్చిన భక్తజనం

మద్నూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓంఓం అయ్యప్ప.. శరణు ఘోషతో పెద్దతడుగూర్ మారుమోగింది. శబరిమలై సన్నిధానం తరహాలో మండలంలోని పెద్దతడుగూరు గ్రామంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరుపుకున్నారు. అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి శరణుఘోష వినిపించారు. పెద్దతడుగూర్ మండల పూజ మహోత్సవాలలో భాగంగా గురుస్వామి వినయ్ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ క్రమంలో కళాకారులు కలి, హనుమంతుడు, శ్రీరాముని, వేషధారణతో భక్తులను అలరించారు, కళాకారుల డప్పుచప్పుల మధ్య అయ్యప్పలు నృత్యాలుచేశారు. కళాకారుల విన్యాసాలు మాలాధారులు నృత్యాలతో పెద్దతడుగు కేంద్రం ఆధ్యాత్మికతతో వెల్లి విరిసింది. అయ్యప్ప విగ్రహాన్ని మెట్లపై ప్రతిష్టించి పాలు, పెరుగు, నెయ్యి, విభూది, పంచదార, చందనం, పసుపు, పండ్లు, తేనె, జలంతో, అభిషేకం చేశారు. అభిషేక సమయములో ఆ ప్రాంతంలో భక్తులు శరణం అయ్యప్ప అంటూ వేడుకున్నారు. అభిషేక పూజల అనంతరం స్వామికి ధూప, దీప నైవేద్యం సమర్పించడంతో వేడుక ముగిసింది. ఈ వేడుక సందర్భముగా గురుస్వామి మహా పాదయాత్ర పూర్తిచేసుకుని పెద్దతడుగుర్‌కు చేరుకున్నారు. పడిపూజకు వచ్చిన భక్తుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, దీక్ష సమయంలోనే కాకుండా దీక్షలేని సమయంలో కూడా పరోపకార సేవ చేస్తూ దైవభక్తి కలిగి ఉండటం వల్ల ఆధ్యాత్మికత మరింత పెరుగుతుందని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాల వేసుకున్న స్వాములు ప్రజలకు భక్తిభావం పెరిగే విధంగా ఉపదే శాలు ఇవ్వాలని సూచించారు. మాలధారులకు మహాఅన్న ప్రసాదం అందించారు.

బీర్కూర్‌లో మహాపడిపూజ

బీర్కూర్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి సంకీర్తనలు, భజనలు అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పల్లకీ సేవ నిర్వహించారు.

కన్నులపండువగా మహా పడిపూజ

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణమయ్యప్ప అంటూ వందలాది అయ్యప్పస్వాముల శరణుఘోషతో భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామం మార్మోగింది. శుక్రవారం రాత్రి తిప్పాపూర్ గ్రామంలోని రెడ్డిఫంక్షన్‌హాల్‌లో వీరమల్లి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో గురుస్వాములు సుబ్బారావు, కన్నయ్యపంతులు, ఉదయ్‌గురుస్వామి మంత్రోచ్ఛరణల నడుమ 18వ మహాపడిపూజ కార్యక్రమాన్ని కన్నుపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరటిబోదెలతో అందంగా కోవెలను తయారుచేసి, కోవెలను తీరొక్కపూలతో అందంగా అలంకరించి కోవెలలో అయ్యప్పస్వామితో పాటుగా గణపతి, కుమారస్వామి విగ్రహాలను పెట్టి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, పూలాభిషేకం, మెట్లపూజను నిర్వహించారు. అంతకుముందుగా గ్రామంలోని ప్రధానవీధుల గుండా ప్రత్యేక వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను నిర్వహించారు. భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



బీర్కూర్‌లో మహా పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు



తిప్పాపూర్‌లో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

ఇదీ అంబులెన్సా!?

- అంబులెన్స్ అవతారం ఎత్తిన తాత్కాలిక ఓమిని వ్యాన్
- టీయూకు అంబులెన్స్ లేక ఇబ్బందులు
- పాడుబడిన వ్యాన్‌నే అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్న వర్సిటీ అధికారులు



ఫోటో న్యూస్

టీయూలో అంబులెన్స్‌గా వినియోగిస్తున్న వాహనం ఇదే..

డిచ్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీకి అంబులెన్స్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు అనారోగ్యానికి గురైన సమయంలో ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ లేక తాత్కాలికంగా పాడుబడిన ఓ వ్యాన్‌ను ఉపయోగిస్తున్నారు. ఆ పురాతన వ్యాన్ సైతం కొన్ని సందర్భాలలో మార్గంమధ్యలో నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ వ్యాన్‌లో కనీసం స్ట్రేచర్, ఆక్సిజన్ కిట్, ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్‌కిట్ లాంటివి దానిలో మచ్చుకు కనబడవు. కానీ దాన్ని అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్నారు. వర్సిటీలో విద్యార్థులు అర్ధరాత్రి సమయాల్లో ఏదైనా అనారోగ్యానికి గురైతే కనీసం వర్సిటీలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేక విద్యార్థులు డిచ్‌పల్లి మండల కేంద్రం, లేదా, నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆపత్కాలంలో ఉండాల్సిన అంబులెన్స్ లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న వైస్‌చాన్స్‌లర్ యాదగిరి రావు నూతన అంబులెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఘటనలు జరగకుండానే చర్యలు చేపట్టాలని విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు కోరుతున్నారు.



జర దేఖో!!

లక్ష్మీదేవునిపల్లి గ్రామ రోడ్డుపై వేసిన కంకర

బీటీ పనులు పూర్తయ్యేనా?

- లక్ష్మీదేవునిపల్లి - గొట్టిముక్కుల రోడ్డుపై కంకర వేసి వదిలేసిన వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రం నుంచి దోమకొండ మండలకేంద్రం కేంద్రం నుండి లక్ష్మీదేవునిపల్లి, గొట్టిముక్కుల మీదుగా చేపడుతున్న బీటీరోడ్డు పనులు ఆలస్యంగా జరుగతున్నాయి. ఈ రోడ్డుపై ప్రస్తుతం కంకర వేసి వదిలేయ్యడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో వ్యవసాయబావుల వద్దకు వెళ్లాలంటే ఈ కంకర కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులను వేగంగా పనులను పూర్తి చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై వేసి ఉన్న కంకర ఇలా..

అంక్సాపూర్ సంత మల్లన్న

జాతరకు సర్వం సిద్ధం

- ఈనెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 16న జాతర, రథోత్సవం



భక్తి

సంత మల్లన్న ఆలయానికి ఏర్పాటు చేసిన మెట్లు

వేల్పూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని అత్యంత ప్రాచూర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిన వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ సంత మల్లన్న జాతర ఉత్సవాలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ పనుల్లో ఎప్పుడు బిజీబిజీగా ఉండే అంక్సాపూర్ గ్రామప్రజలు సంతమల్లన్న దేవుడిని కొలిచేందుకు వారం రోజులు కేటాయిస్తారు. మొక్కులు తీర్చే దేవుడిగా పేరొందిన సంతమల్లన్నకు ఏడాదిపాటు భక్తులు తమ దీక్షలను కొనసాగిస్తుంటారు. ఈనెల 16న జరిగే జాతర, రథోత్సవాలకు డివిజన్‌లోని మండలాలకు చెందిన ప్రజలే కాకుండా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఎద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. అంక్సాపూర్ గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ తోటల మధ్య ఎత్తైన కొండపై వెలిచిన సంతమల్లన్న ఆలయంలో శివలింగాలు కొలువై ఉన్నప్పటికీ ఇక్కడి ప్రాంత ప్రజలు సంతమల్లన్న దేవునిగానే పిలుస్తుంటారు. అంక్సాపూర్ గ్రామ ఆచారం ప్రకారం ఉత్సవ మూర్తులను, సంతమల్లన్న విగ్రహాలను ఆదివారం పల్లకీలో ఆగ్గోల్ల సహాయంతో నగర డోలును మోగించుకుంటూ సంత మల్లన్న గుడి వద్దకు తీసుకువెళ్తారు. అలాగే వీరితో పాటు బంతిపవ్వులతో అలంకరించిన షిడే (రథం) గుట్ట వద్దకు తీసుకువెళ్తారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కాలినడకన పల్లకిలో విగ్రహ ప్రతిమలను ప్రవితగోదావరి నదిలో స్నానం కోసం చిట్టాపూర్ గ్రామానికి డప్పువాయిద్యాలతో తీసుకువెళ్లారు. ఆ రాత్రి అక్కడే బస చేసి శనివారం గోదావరి స్నానం పూర్తి కాగానే తిరిగి బయలుదేరి రాత్రికి అంక్సాపూర్ గ్రామానికి చేరుకుంటారు. ఈనెల 15న (ఆదివారం) సంతమల్లన్న కల్యాణ మహోత్సవం, 16న (సోమవారం) జాతర రథోత్సవం నిర్వహిస్తారు. 17న (మంగళవారం) వివిధ డివిజన్‌లకు చెందిన గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ఆటోలపై సంతమల్లన్న గుట్ట వద్దకు వచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఇందులో భాగంగా భక్తులు బోనాలు వేస్తూ ఐదు రకాల ధాన్యాలను ఒక చోట వేసి వాటిపై ఉడికించిన నైవేద్యాలను సంత మల్లన్న దేవునికి సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆదీనంలో తీసుకున్నప్పటికీ అంక్సాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఈ జాతర ఉత్సవాల ఏర్పాట్లను ప్రత్యక్షంగా నిర్వహించడం విశేషం. అంక్సాపూర్ నుంచి సంతమల్లన్న ఆలయం వరకు బీటీరోడ్డు, గుట్ట చుట్టు రథం, తింపడానికి సీసీ రోడ్డు, ఇటీవలే ఆలయం భూమి విస్తీర్ణం చుట్టూ బీటీ రోడ్డు నిర్మించారు. ధర్మశాలలు, విశ్రాంతి గదులు, గుట్టపైన, కింద మంచినీటి ట్యాంకులను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



జాతరకు ముస్తాబైన సంతమల్లన్న ఆలయం

ఆలయ స్థలపురాణం

ఈ దేవాలయం గత దశబ్దాన్నర క్రితం వెలిసిందని చెబుతున్నారు. అప్పట్లో ఈ ఆలయం ప్రాంతం చుట్టు దట్టమైన ఆడవి ఉండేది. ఈ అడవిలో సాదువులు, సంతులు తపోసిద్ధికై కఠోర తపస్సు చేసేవారు. ఈ అడవిలో ఎక్కువగా పశువులు మేత మేయడానికి వెళ్లేవి. అనుకోకుండా ఈ ప్రాంతంలో వ్యాధులు సోకి పశువులు చనిపోయాయి. దీంతో తీవ్ర ఆవేదనతో కుమిలిపోయిన పశువుల కాపారులు ఈ అడవిలో తపస్సు చేస్తున్న సాధు, సంతులను వేడుకోగా వారు అనుగ్రహించి గుట్టపై కొలువై ఉన్న మల్లన్న దేవున్ని పూజిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని కాపారులకు చెప్పి సదుసంతులు అధృశ్యమయ్యారని ఈ ప్రాంత పురాణం తెలుపుతోంది. ఈ దేవాయాన్ని సదు సంతులు ఏర్పాటు చేశారన్న భవంతో ఆనాటి నుంచి ఈ దేవాలయాన్ని మల్లన్న దేవునికి బదువుగా సంత మల్లన్న దేవాలయంగా పిలుస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు, పువులకు ఏలాంటి వ్యాధులు సోకిన సంత మల్లన్నకు నైవేద్యాలు సమర్పించుకుంటారు. ఇలా చేస్తే వ్యాధులు గాని ఇతర అపదలు రావని, వచ్చిన తొలగిపోతాయని ఇక్కడి వారికి గట్టి నమ్మకం.



అంక్సాపూర్ సంత మల్లన్న ఆలయ ముఖద్వారం



ఆలిండియా ఆర్చరీకి ఎంపికైన క్రీడాకారులు

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు దోమకొండ గడికోట క్రీడాకారుల ఎంపిక

దోమకొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా యూనివర్సిటీ ఆర్చరీ జాతీయ స్థాయి పోటీలకు దోమకొండ గడికోటకు చెందిన విద్యార్థులు కదిరే సింధుజ, బోరెడ్డి నిఖిత, భవాని ఎంపికైనట్లు కోచ్ ప్రతాప్‌దాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27 వరకు భువనేశ్వర్‌లో జరిగే నేషనల్ స్థాయి పోటీల్లో సింధుజ, నిఖిత ఉస్మానియా యూనివర్సిటీ తరపున, భవాని తెలంగాణ యూనివర్సిటీ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు ముగ్గురు క్రీడాకారులు భువనేశ్వర్‌కు తరలివెళ్తున్నట్లు తెలిపారు. నేషనల్‌కు ఎంపికైన వీరు ముగ్గురు క్రీడారులను ఆర్చరీ జిల్లా అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్, సెక్రటరీ కదిరె మోహన్‌రెడ్డి, ట్రెజరర్ గంగాధర్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ,రెడ్‌క్రాస్ సోసైటి ఆధ్వర్యంలో శుక్రవారం మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల పలువురి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రో త్సహించడం వల్ల సమాజంలో సేవాభావం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ శ్రవణ్ కుమార్, ఏఎస్‌ఓ రాజశేఖర్, డీఈ కళ్యాణ చక్రవర్తి, నాగరాజ్, ఏడీఈ కిరణ్‌చైతన్య, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రాజన్న, నరసింహరావు,విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని 27వ వార్డులో గల బాలికల ప్రాథమిక,జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని,నీటి సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే అందజేయాలి



పాడి పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సదాశివనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులకు బకాయి ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించేందుకు కృషి చేయాలని తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకుంట తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు అమిత్‌రెడ్డిని కలిసి పెండింగ్ బిల్లులపై వెంటనే స్పందించాలని వినతిపత్రం అందించారు. విజయ డెయిరీకి పాలు అందించే పాడిరైతులు అనేక రోజులుగా బిల్లులు అందక పశుపోషణలో అనేక ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని అన్నారు. బిల్లులు సకాలంలో అందక పశువులకు దాన అవసరం మేరకు వైద్యం అందించలేకపోవడం వల్ల పాల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే అందించే విధంగా కృషి చేయాలని కోరారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత



భిక్కనూరులో సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్సై సాయికుమార్

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన నలుగురు బాధితులకు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ రికవరీ చేసిన సెల్‌ఫోన్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరి సెల్‌ఫోన్ అయిన చోరీకి గురైతే వెంటనే పూర్తి వివరాలతో సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే చోరీకి గురైనా, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో 24 గంటల్లో గుర్తించి బాధితులకు అప్పగించడం జరు గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

సదాశివనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన తిరుపతి లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీ చెక్కును సింగిల్‌విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి బాధితురాలి ఇంటివద్దకు వెళ్లి అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి పార్టీలకు సంబంధం లేకుండా ఆపద వచ్చిందని తెలియజేస్తే తక్షణమే ఏర్పాట్లు చేసి బాధితులను ఆదుకోవడానికి ఎమ్మెల్యే ప్రత్యేక ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న సింగిల్‌విండో చైర్మన్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్ రావు

తాడ్వాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కామారెడ్డి ఆర్డీవో రంగ నాథ్ రావు అన్నారు. ఈయన శుక్రవారం మండల కేంద్రంలోని అధికారులు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అధికారులు అలసత్వం వీడి త్వరగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పైరవీలకు చోటు లేకుండా ఇళ్లు లేని నిరుపేద లబ్ధిదారులకే చెందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతీ గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించాల న్నారు. గ్రామాలకు సర్వేకు వచ్చే అధికారులకు ప్రతి ఒక్కరు సహకరిం చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ ఉన్నారు.

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం 46వ వార్డులో దరఖాస్తుదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కోయిలకర్ కన్నయ్య మాట్లాడుతూ సొంతస్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి నాలుగుదఫాలలో ప్రభుత్వం 5 లక్షలు మంజూరుచేస్తుందని అన్నారు. వార్డు ఆఫీసర్లు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వస్తారని మహిళల పేరుపైనే ఆన్లైన్ చేసుకోవాలని తెలిపారు. ఆధార్‌కార్డు, ఇంటి డాక్యుమెంట్స్, ఇంటి ట్యాక్స్ రిసీప్ట్ లేదా కరెంట్ బిల్లు రిసిప్ట్ ఉంచుకోవాలని తెలిపారు.స్థలం లేని వారికి త్వరలోనే ప్రభుత్వం స్థలాలను అందిస్తుందని తెలిపారు.



తాడ్వాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

ఖాతా ఖాళీ..

(5వ పేజీ తరువాయి)

మోసపోయే వరకు మేలు కోవడం లేదని తెలుస్తోంది.

పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మోసపోతున్న ప్రజలు జిల్లాలోని ఆయా పోలీసుస్టేషన్ పరిధిలో నిత్యం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ప్రజలు దృష్టి సారించకపోవడంతో ఏదో ఒక చోట డబ్బులు పోగొట్టుకుని మోసపోతున్నారు. కొసరు కోసం పోయి అసలు కూడా పోగొట్టుకుంటున్నారు. కొత్త నెంబర్ల నుంచి వచ్చే వెబ్‌సైట్ లింకులపై క్లిక్ చేయకూడదని ఎవరైనా క్యాష్ ఇవ్వండి ఫోన్‌పే చేస్తామని అడిగితే నిరాకరించాలని పోలీసులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే లింక్‌లను క్లిక్‌చేస్తే ఫోన్ హ్యాక్ చేసి వాట్సాప్ గ్రూప్‌లను వారి పరిధిలోకి తీసుకుంటున్నారు. వారి వద్ద డబ్బులు కాజేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదైనా పథకాలు తీసుకువస్తే చాలు వాటిని గ్రూప్‌లలో ఏపీకే ఫైల్స్ ద్వారా పంపి మిగిలిన వారిని సైబర్ బురిడీ కొట్టిస్తున్నారు. మన ఫోన్ గుర్తు తెలియని వ్యక్తులకు ఇవ్వడం మంచిది కాదు. క్యూ ఆర్ కోడ్ వంటి వివరాలను వారి ఫోన్ సాయంతో తస్కరించి మోసాలకు పాల్పడే అవకాశముంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, పేమెంట్ యాప్‌లకు సంబంధించిన పాస్‌వర్డ్‌లు గోప్యంగా ఉంచుకోవాలి. ఫోన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ పాస్‌వర్డ్‌లు నమోదు చేయకూడదు. డిజిటల్ అరెస్టులు అనేవి ఉండవని పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మోసపోతునే ఉన్నారు. కుటుంబ సభ్యులు అరెస్టు అయినట్లు కాల్ వస్తే వెంటనే వారు ఉన్న పరిధిలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.

ప్రపంచంలోనే గర్వపడే ప్రాజెక్టు నిజాంసాగర్

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి

నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

తాగు నీటికే పరిమితమైన సింగూరు

నిజాంసాగర్ ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయినా సింగూరు ప్రాజెక్టును నిర్మించినా ఒప్పందం ప్రకారం నీరు రాలేదు. హైదరాబాద్ పట్టణాలకు తాగునీటికే పరిమితమై అప్పుడప్పుడు 5 నుంచి 6 టీఎంసీల నీటిని నిజాంసాగర్‌కు విడుదల చేసేవారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ నియోజక వర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కేవలం 3,360 ఎకరాలే నియోజకవర్గానికి పరిమితమైందని ఆయన అన్నారు. మంత్రి చొరవతో అంతర్రాష్ట్ర ప్రాజెక్టును పూర్తి చేయించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణలోని నైజాం నాటి ప్రాజెక్టు నిజాంసాగర్ అని ఎమ్మెల్యే పోచారం గుర్తుచేశారు.

నిజాంసాగర్ నీటి విడుదల షెడ్యూల్ ఇలా..

లక్షా 30వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ నీటి విడుదల పది రోజుల నుంచి 15 రోజుల వరకు చేస్తారు. డిసెంబరు 13 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు ఆరు విడతలుగా నీటిని విడుదల చేస్తారు. ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు 10.8 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ ఈఈ సోలోమెన్ తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

మద్నూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల కాలంలో మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన వాటి పెండింగ్ బిల్లలను ఇప్పించాలంటూ ఉమ్మడి మద్నూర్ మండల మాజీ సర్పంచులు ఎంపీడీవో రాణికి వినతి పత్రం సమర్పించారు. తాము సర్పంచులుగా ఉన్నపుడు గ్రామాల్లో చాలా అభివృద్ధి పనులు చేశామని, ఎంబీ, బిల్లుల రికార్డు చేసి ఉన్నత అధికారులకు ఇచ్చామని, రెండేళ్ల నుంచి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం అంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే మాకు తిప్పలు తప్పడం లేదని వారు వినతిపత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో తాము చేసిన అప్పులకు వడ్డీతో కలిపి రెండింతలు అయిందని అధికారుల చుట్టూ తిరిగిన తమకు బిల్లులు మాత్రం రావడం లేదంటూ వాపోయారు. అధికారులు ఆఫీసుల చుట్టూ తిరిగి సర్పంచులు అనారోగ్యం బారిన పడిన పరిస్థితి నెల కొందని గుర్తు చేశారు. ప్రభుత్వం మా సమస్యలను అర్థం చేసుకొని పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మద్నూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సూర్యకాంత్, గఫార్ ఉన్నారు.

నేడు కురుమ సంఘం నూతన భవనం ప్రారంభం

● పోస్టర్లను ఆవిష్కరించిన సంఘ సభ్యులు



బాన్సువాడలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

బాన్సువాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కోకాపేటలో నూతనంగా నిర్మించిన కురుమ సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి శనివారం కురుమ సంఘం సభ్యులు భారీ సంఖ్యలో తరలి రావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పరువుగొండ పిలుపునిచ్చారు. శుక్రవారం బాన్సువాడలో ప్రారంభోత్సవ వాల్‌పోస్టర్లకు సంఘ సభ్యులు ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి కురుమ సంఘం సభ్యులతోపాటు ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఛైర్మన్ కాసుల బాలరాజులతో పాటు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు జల్దేవర రమేష్, బాన్సువాడ నియోజకవర్గం కురుమ సంఘం అధ్యక్షుడు గంగుల గంగారం, బాన్సువాడ మండల అధ్యక్షుడు బీరుగొండ, బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్ నర్సిగొండ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలు బంద్

బీర్కూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విలీన ప్రక్రియ కారణంగా మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు ఈ నెల 28 నుంచి 31 వరకు అందుబాటులో ఉండవని బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం అందుకు సంబందించిన ఫ్లెక్సీలను బ్యాంకు ఎదుట ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు సంబందించిన శాఖలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. అయితే ఆ శాఖలను తెలంగాణా గ్రామీణ బ్యాంక్‌లో విలీనం చేస్తున్నందున నాలుగు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవన్నారు. బ్యాంకు సేవలు 01.01.2025 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఖాతాదారులు తమకు సహకరించాలని కోరారు. 2 విషయాలను దృష్టిలో పెట్టుకొని ఖాతాదారులు ముందు గానే ఆర్థిక లావాదేవీలు పూర్తి చేసుకోవాలని కోరారు.



బీర్కూర్‌లో బ్యాంకు ఎదుట ఫ్లెక్సీ పెడుతున్న సిబ్బంది

దొంగనోట్ల మూలాలు ముంబైలో?

● ముంబైకి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న కామారెడ్డి పోలీసులు
● వారి వద్ద నుంచి రూ.30లక్షల నకిలీ నోట్ల స్వాధీనం
● లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కామారెడ్డి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా బిచ్కుందకు చెందిన ఓ వ్యక్తి వద్ద ఇటీవల లభ్యమైన దొంగనోట్ల మూలాలకు ముంబైతో సంబంధం ఉన్నట్టు కామారెడ్డి జిల్లా పోలీసులు జరిపిన విచారణలో తేలినట్టు విశ్వసనీయ సమాచారం. జిల్లాలోని బిచ్కుంద, బాన్సువాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు ముంబైలోని దొంగనోట్ల ముఠాతో సంబంధాలు పెట్టుకుని జిల్లాలో నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నట్టు తేలింది. జిల్లాలో కొందరు దొంగనోట్లను చెలామణి చేస్తున్నారనే సమాచారం మేరకు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న ఎస్పీ సింధూశర్మ ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక టీమును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన బిచ్కుందకు చెందిన ఓ వ్యక్తి వద్ద పలు దొంగనోట్లను స్వాధీనం చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. బాన్సువాడ పట్టణానికి చెందిన మరో వ్యక్తికి సంబంధం ఉండడంతో అతన్ని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరినీ పోలీసులు తమదైన శైలిలో విచారించగా హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి.. దొంగనోట్లను జిల్లాకు చేరవేస్తున్నట్లు తేలింది. ఈ ముగ్గురికి ముంబైలోని మరో ఇద్దరితో సంబంధాలు ఉన్నట్లు తేలడంతో జిల్లా పోలీసులు రెండు రోజుల క్రితం ముంబైకి వెళ్లి సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ముంబై వ్యక్తుల నుంచి రూ.30లక్షల వరకు దొంగ నోట్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు మొత్తం ఐదుగురు నిందితులను కామారెడ్డి జిల్లా పోలీసు ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకొని మరింత లోతుగా విచారణ చేపడుతున్నట్టు తెలిసింది. కాగా.. ఈ దొంగనోట్ల వ్యవహారంపై కామారెడ్డి జిల్లా పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరగా.. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద గురువారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్ రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులను ఉద్యమకారులుగా, రైతులను ఉగ్రవాదులుగా చూడడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమి కాదన్నారు. లగచర్లలో అక్రమం అరెస్ట్ అయి జైల్లో ఉన్న గిరిజన రైతుకు గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకురావడానికి ఉగ్రవాదులకు వేసినట్లు బేడీలు వేసి తీసుకెళ్లడాన్ని బీజేపీ ఖండిస్తుందన్నారు. రైతులకు బేడిలు వేయడం సిగ్గుచేటన్నారు. రేవంత్ రెడ్డి పాలనకు, కేసీఆర్ పాలనకు తేడా ఏమి లేదని మారింది పాలకులు మాత్రమేనని పాలన కాదని ప్రజలకు అర్థమవుతుందన్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, రవీందర్, రాజు, రజినీకాంత్, రాజేష్, రాజగోపాల్, సాయి, గోవర్దన్, మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



భిక్కనూరులో విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

క్రీడల్లో గెలుపోటములు సహజం

● గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సీఎం కప్ క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, మొమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను బయటకు తీసుకురావ డానికే ఈ సీఎం కప్ క్రీడలను నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు, యువత చదువుతో పాటుగా క్రీడల పట్ల దృష్టి సారించాలని కోరారు. అనంతరం జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహిసీల్దార్ శివ ప్రసాద్, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, ఈవో మహేష్‌గౌడ్, ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

● జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం



మద్నూర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి

మద్నూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో గత ఏడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణతశాతం పెంచేవిధంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శించి రిజిస్టర్‌లను పరిశీలించారు .అనంతరం రాబోయే 90 రోజుల్లో అధ్యాపకులు తీసుకోవాల్సిన యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహించి 90 రోజుల్లో విద్యార్థులు చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని, యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ, అధ్యాపకులు గంగాధర్, సంపత్, ఐనోద్దీన్ ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి

సదాశివనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా బొల్లిపల్లి రమేష్‌రెడ్డిని గురువారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కుంటరాంరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చక్రధర్‌గౌడ్, నాయకులు రవీందర్‌రావు, లింగారావు, విఠల్, భాస్కర్‌రెడ్డి,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

మద్నూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద తడ్గూర్ గ్రామంలో రైతులు యాసంగిలో సాగుచేస్తున్న, శనగ, మినుము, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, వరి, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు పరిశీలించి రైతులకు తగు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా శనగ పంటలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లేదా టేబుకొనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, అలాగే శనగలో తొలి దశలో రబ్బరు పురుగు గమనించి నట్లయితే నోవాల్యురాన్ 2 ఎంఎల్ క్వినల్ఫస్ మందుని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. రైతులు తాము పండిస్తున్న పంటలపై అవగాహన కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. వారికి తగిన సలహాలు, సూచనలు వ్యవసాయ శాఖ తరఫున అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అనిల్ పాల్గొన్నారు.

గ్రూప్-4 జిల్లాలో మూడవ ర్యాంకు సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ రాకేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైనా గ్రూప్-4 ఫలితాల్లో జిల్లా మూడవ ర్యాంకు సాధించి రెవిన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం పొందిన భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించే రాకేష్‌ను భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాకేష్ కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్-4కు ప్రిపేరై జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి - రోటి కపడా రోమాన్స్
దర్శన్ - మిస్ యూ
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - ఫణి

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - ఝూన్సీ ఐపీఎస్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

